ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 8 డిసెంబరు 2025



నేడు జిల్లాకు బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి రాక

పార్వతీపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సత్యనారాయణ నేడు జిల్లాకు రానున్నారు. మన్యంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలను పరిశీలించనున్నారు. అదే విధంగా ఆ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల తీరుపై ఆరా తీయనున్నారు. అనంతరం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. జిల్లాలో పథకాల అమలు, ఇతర అంశాలపై చర్చించనున్నారు.

ఇంకా పరాయి పంచనే!

- జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువు
- అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్న వైనం
- హడావుడిగా జిల్లాలను ఏర్పాటు చేసిన వైసీపీ సర్కారు
- సౌకర్యాల కల్పనపై నిర్లక్ష్యం
- వేధిస్తున్న మౌలిక వసతుల కొరత
- ప్రజలు, ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

పార్వతీపురం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పడి మూడున్నరేళ్లు గడుస్తున్నా.. ఇంకా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల సమస్య వేధిస్తోంది. నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న దుస్థితి. ప్రతి నెలా లక్షలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గత వైసీపీ సర్కారు ఎంతో హడావుడిగా జిల్లాల విభజన చేసింది. కానీ మౌలిక వసతులపై దృష్టి సారించలేదు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను నిర్మించలేకపోయింది. ఫలితంగా అటు అధికారులు, ఇటు ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, డీఆర్‌డీఏ, డీఎం సివిల్ సప్లైస్ శాఖలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇక మిగతా సుమారు 50 శాఖలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కాగా వాటికి ప్రతినెలా లక్షలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. అయితే ఆయా అద్దె భవనాల్లో మౌలిక వసతులు కొరవడ్డాయి. మరుగుదొడ్లు, తాగునీరు, డైనింగ్ హాల్ తదితర సదు పాయాలు లేకపోవడంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఉద్యోగులు సొంత సొమ్ముతో తాగునీరు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లా విభజనకు ముందు ఉన్న కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఉన్నతాధికారులకు కేటాయించారు.
- పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ భవనాల సముదాయంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహి స్తున్నారు. అయితే వర్షాకాలంలో గదులన్నీ కారిపోగా.. ఆ ప్రాంతం బురదమయంగా మారుతుంది. దీంతో ఆయా కార్యాలయాలకు వెళ్లాలంటే నరకమే. ప్రజలు, ఉద్యోగులే కాదు.. అధికారుల వాహనాలు కూడా రాకపోకలు సాగించలేని దుస్థితి.
- జిల్లాకేంద్రంలో కలెక్టరేట్‌కు

(మిగతా 8వ పేజీలో...)


పార్వతీపురంలోని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు



ఐటీడీఏ కార్యాలయం కోసం నిర్మించిన భవనంలో కొనసాగుతున్న కలెక్టరేట్

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం
- మూడు రాష్ట్రాల ఆర్ఎస్ఎస్ ప్రచారక్ భరత్‌కుమార్
8 లో

పాత బట్లభద్రలో ఏనుగులు
- ఆందోళనలో రైతులు, గ్రామస్థులు



గిరిజన సమస్యలపై కవితా సంకలనం
8 లో

ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు
- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



8 లో
విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకురండి

ఏజెన్సీలో పర్యాటకుల సందడి


మెట్టుగూడ జలపాతం వద్ద సందర్శకులు ఇలా..
8 లో

వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు

సదవకాశం

- స్టాంప్ డ్యూటీ తగ్గించిన ప్రభుత్వం
- ఆస్తి విలువ రూ.10 లక్షల లోపు ఉంటే.. రూ.100 చెల్లిస్తే చాలు

పాలకొండ, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ఫీజుల విషయంలో కూటమి ప్రభుత్వం మార్పులు తెచ్చింది. దీని ప్రకారం.. ఎకరం మార్కెట్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే.. ఇకపై స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10 లక్షల పైన ఉంటే రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో వ్యవసాయ భూముల మార్కెట్ విలువ ఎకరం రూ.10 లక్షల లోపే ఉంది. పాలకొండ మండలంలో చూస్తే.. ఇక్కడ ఎకరం భూమి మార్కెట్ విలువ రూ.4 లక్షలుగా ఉంది. ఇదే ప్రాంతంలో వారసత్వంగా ఉన్న ఎకరా వ్యవసాయ భూమిని కుటుంబ సభ్యులు భాగ పంపిణీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే రూ.400 స్టాంప్ డ్యూటీగా చెల్లిస్తే సరిపోతుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఆ భూమి వారసుల పేర్లపై ఆటో మేటిక్‌గా మారుతుంది. జిల్లాలోని పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు సరాసరి 50 నుంచి 80 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వాటిలో 50 శాతం వారసత్వ భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లే ఉంటాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా గత వైసీపీ ప్రభుత్వం అధికంగా స్టాంప్ డ్యూటీని వసూలు చేసేది. నేడు సగానికి పైగా చార్జీ తగ్గడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాలకొండ సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా.. 'వారసత్వ వ్యవసాయభూములు రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ఫీజులపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ నిబంధనలు మేరకు రిజిస్ట్రేషన్ ప్ర క్రియ కొనసాగిస్తాం.' అని తెలిపారు.



విహారంలో విషాదం
7 లో
- జలపాతం వద్ద ఊబిలో పడి యువకుడి మృతి

అమ్మో చలి
8 లో
- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- వణికిపోతున్న ప్రజలు



పెద్ద చెరువు ఎందుకిలా?

- చనిపోతున్న మత్స్యసంపద
- సమీప ప్రాంతాల్లో దుర్వాసన
- ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానికులు


పెద్ద చెరువులో చనిపోయిన చేపలు

విజయనగరం టౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విజయనగరం అంటేనే అందరికీ పెద్దచెరువు గుర్తుకువస్తుంది. అంతటి ముఖ్యమైన చెరువులో కొద్దిరోజులుగా వేలాదిగా చేపలు మృత్యువాతపడుతున్నాయి. దీంతో అటుగా వెళ్లేవారికి, ఆ ప్రాంతం వాసులకు చెడు వాసన వస్తోంది. బాలాజీ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపం వరకూ సుమారు కిలోమీటరు పొడవునా చెరువు ఒడ్డున మృత చేపలు చేరాయి. ట్యాంక్‌బండ్ రహదారి గుండా వెళ్లే వాహనదారులు ముక్కు మూసుకుంటూ ప్రయాణం చేస్తున్నారు. పెద్దచెరువు చుట్టూ షాపింగ్‌మాల్స్‌తో పాటు, గృహ సముదాయాలున్నాయి. ఈ దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో ఉండే బోరులోకి కూడా ఆ నీరు ఇంకి రోగాల పాలవుతామేమోనని భయపడుతున్నారు. ఈ దుర్గంధం వల్ల చెరువు దక్షిణ గట్టుపై ఏర్పాటుచేసిన ఆచంట గార్డెన్ ఆదివారం బోసిపోయింది. 'చెరువులో చేపలు చనిపోవడంతో దుర్గంధం వెదజల్లడం వాస్తవమే. నీటిపారుదల శాఖ అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి. కార్పొరేషన్ తరుపున మూడు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి చేపలను తొలగిస్తున్నాం.' అని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు.

పద్ధతి మార్చుకోండి: సబ్ కలెక్టర్

పాలకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 'కొందరు మిల్లర్లు రైతుల వద్ద రెండు నుంచి ఐదు కేజీల వరకు అదనంగా ధాన్యం తీసుకుంటున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఇది సరికాదు.. పద్ధతి మార్చుకోండి.' అని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆదివారం తుమరాడలోని ఓ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వారికి మద్దతు ధర దక్కేలా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రెవెన్యూ యంత్రాంగం పర్యవేక్షిస్తుందన్నారు. అనంతరం ధాన్యం శాంపిల్స్ రైస్‌మిల్లులోని రికార్డులు పరిశీలించారు.


ధాన్యం ట్రాన్స్‌పోర్టు లారీని పరిశీలిస్తున్న దృశ్యం

శతశాతం ఉత్తీర్ణతకు ▶ వంద రోజుల ప్రణాళిక

- అమలుకు విద్యాశాఖ శ్రీకారం
- టెన్త్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధం

పార్వతీపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ వందరోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గత మూడేళ్ల టెన్త్ ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సారి కూడా అదే స్థానం కైవసం చేసుకోవాలని విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో టెన్త్ విద్యార్థులను, ఉపాధ్యాయులను పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలలలో ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సబ్జెక్ట్‌లపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రణాళిక ప్రకారం చదివిస్తూ.. విద్యార్థులకు అవసరమైన సలహా, సూచనలు అందిస్తున్నారు. మొత్తంగా ప్రైవేట్‌కు దీటుగా ఫలి తాలు సాధించేందుకు అధికారులు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి పాఠశాలకు ప్రత్యేక అధికారిని నియమించారు. పిల్లల చదువులతో పాటు వారి ఆరోగ్యాలపై పర్యవేక్షణ చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో 187 వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు పది వేల మంది విద్యార్థులు ఈ సారి టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో ఈ నెల ఆరో తేదీ నుంచే వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా హెచ్ఎంలు సబ్జెక్టు ఉపాధ్యా యులతో సమావేశం నిర్వహించాలి. రోజువారీ బోధన, తదితర అంశాలకు చెందిన షెడ్యూల్ తయారుచేయాలి. రోజూ నిర్వహించే పరీక్షల ఫలితాలను సాయంత్రం



(మిగతా 8వ పేజీలో...)

నిబంధనల ప్రకారం ▶ ధాన్యం కొనుగోలు: కలెక్టర్

సీతానగరం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం కోట సీతారాంపురంలో పర్యటించారు. ముందుగా ధాన్యం నూర్పిడి జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి రైతులు, సిబ్బందితో మాట్లాడారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తూకం వేయాలని ఆదేశించారు. రైతుసేవా కేంద్రాల నుంచే గోనె సంచులు, రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రవాణా ఖర్చు అందుతుందా? లేదా! అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద తేమ శాతం ఒకే విధంగా ఉండాలన్నారు. ఈ ప్రాంతం డ్రై ఏరియా కావడంతో రబీలో హార్టీకల్చర్ వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. తమ పంట పొలాల్లో బోర్లు సరిగ్గా పడటం లేదని, కెనాల్ సౌకర్యం కావాలని కొందరు గ్రామ స్థులు కలెక్టర్‌ను కోరారు. ఆ ప్రాంతంలో బోర్‌వెల్స్ ఎక్కడెక్కడ పడతాయో సర్వే నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రైస్ మిల్లుకు షోకాజ్ నోటీసు

సీతానగరం (బలిజిపేట): బలిజిపేట మండలంలో ఓ మోడరన్ రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని సరిచూసే మాయిశ్చర్ టెస్టింగ్ యంత్రాల పనితీరును పరిశీలించారు. అయితే తూనిక యంత్రం సరిగ్గా లేకపోవడం, తూకంలో అవకతవకలకు పాల్పడడంతో రైస్ మిల్లుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో మరింత అప్రమత్తంగా

(మిగతా 8వ పేజీలో...)


ధాన్యం నూర్పిడి ప్రాంతంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

అదనపు పీహెచ్‌సీ ఎప్పుడో?

● పదేళ్లుగా డిమాండ్ చేస్తున్న గజపతినగరం ప్రజలు

● పట్టించుకోని ఉన్నతాధికారులు, నేతలు

గజపతినగరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలో అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు ప్రతిపాదన అటకెక్కుతోంది. పెరుగుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా మరో పీహెచ్‌సీ ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్తున్నా కార్యరూపం దాల్చడంలేదు. ఈ నేపథ్యంలో సిబ్బంది చాలకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలందడం లేదు.

మండలంలోని జనాభా ప్రాతిపదికన అదనపు పీహెచ్‌సీ మంజూరుచేయాలని పదేళ్లుగా వైద్యులుచేస్తున్న ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. 30 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ అవసరం. కాగా 60 వేలుపైబడి జనాభా ఉన్న మండలంలో ఒకే పీహెచ్‌సీఉంది. 2019లో టీడీపీ హయాంలో జిన్నాంలో అదనపు పీహెచ్‌సీకి ప్రతిపాదనలుచేశారు.ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో అదనపు పీహెచ్‌సీ జిన్నాంలో మంజూరు చేయకుండా గజపతినగరం సీహెచ్‌సీలోనే వైద్యాధికారులకు అదనంగా ఒక గదిని ఏర్పాటుచేశారు.అయితే సీహెచ్‌సీ ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో అక్కడ ఉన్న వైద్యసిబ్బందికే వసతి కష్టతరంగా మారింది. దీంతో అక్కడి వైద్యాధికారులను మరుపల్లి పీహెచ్‌సీకే పంపించారు. అదనపు పీహెచ్‌సీకి సంబంధించి ఇద్దరు వైద్యులు ఉన్నా నలుగురు సూపర్‌వైజర్లకు రెండుపోస్టులు ఖాళీగాఉన్నాయి. దీంతో మరుపల్లి పీహెచ్‌సీ సిబ్బందిపై అదనపు భారంపడుతోంది. మండలంలోని 30 పంచాయతీలకుగాను మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలో నలుగురితో సేవలందించాల్సి వస్తోంది.దీంతో మండలంలోని చుట్టుపక్కలగ్రామస్థులు మరుపల్లి పీహెచ్‌సీకేసేవలకు రావల్సిఉండడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

మండలంలోని 63,579 మంది జనాభాకు మరుపల్లి పీహెచ్‌సీ నుంచే వైద్యసేవలు అందించాల్సివస్తోంది.దీనికితోడు వైద్యులకు అదనంగా 104 సేవలకు రోజుకు ఒకవైద్యాధికారి వెళ్లాల్సిఉంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ పరిధిలో 21 గ్రామసచివాలయాలకు గాను నలుగురు హెల్త్ అసిస్టెంట్లకు గానూ ఒక్కరే ఉన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు మరుపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల అత్యవసర సమయాల్లో వైద్యసేవలందించేందుకు వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మరుపల్లి పీహెచ్‌సీ భవనం

దృష్టికి వైద్యాధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని తీసుకువెళ్లారు. దీంతో తమ సమస్యకు పరిష్కారంలభిస్తుందని వైద్యసిబ్బంది ఆశతో ఎదురు చూస్తున్నారు.

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం

మరుపల్లి పీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి తెలిపారు. అదనంగా మంజూరుచేసిన ఏరియాఆసుపత్రిలో ఇచ్చిన భవనం చాలక మరుపల్లి పీహెచ్‌సీలో నలుగురు వైద్యులు సేవలందించాల్సి వస్తోందని చెప్పారు.దీంతోచుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బందులుపడుతున్నారని తెలి పారు. అదనపు పీహెచ్‌సీ భవనం మంజూరు చేయాలని కోరుతున్నామని చెప్పారు.

విహారంలో విషాదం

● జలపాతం వద్ద ఊబిలో పడి యువకుడి మృతి


హరిబాలరామకృష్ణ (ఫైల్)

రామభద్రపురం/సాలూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో పిక్నిక్‌కు వెళ్లిన యువకుడు జలపాతంలో ఈదుతూ ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం దళాయివలస వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో రామభద్రపురానికి చెందిన గర్భాపు హరిబాలరామకృష్ణ (24) మృతిచెందాడు. పోలీసులు, స్నేహితుల కథనం మేరకు..రామభద్రపురం మండల కేంద్రానికి చెందిన హరిబాలరామకృష్ణతో పాటు కొంతమంది యువకులు కలిసి ఆదివారం పిక్నిక్‌కు బయలుదేరారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం దళాయివలసవద్ద ఉన్న జలపాతం చూడాలనుకున్నారు. అక్కడికి చేరుకున్నాక చాలాసేపు ఉల్లాసంగా గడిపారు.ఇక ఆపేద్దామనుకుని,ఇంటికి వెళ్లిపోదామని అనుకున్నారు. అంతలోనే హరిబాల రామకృష్ణ ఈతకొడుతూ ఒకేసారి హాహాకారాలు చేశాడు. లోపలికి దిగబడిపోతూ కేకలు పెట్టాడు. క్షణాల్లో కనిపించకపోవడంతో భయపడిన అతని స్నేహితులు సమీపంలోని గిరిజనులకు తెలిపారు. వారొచ్చి యువకుడిని బయటకు తీశారు. అనంతరం 108 ద్వారా సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రామకృష్ణ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారాన్ని అతని తండ్రి గర్భాపు గోవిందకు తెలిపారు. హరిబాల రామకృష్ణ స్థానికంగా ఉన్న ఓ ఫైనాన్స్ సంస్థలో జాబ్ చేస్తున్నాడు. గర్భాపు గోవిందకు ఇద్దరు కుమారుల్లో ఈయన రెండో కుమారుడు. చేతికి అందివచ్చిన కొడుకు ఈ విధంగా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సాలూరు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు.

ఎన్‌ఆర్‌పురం ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా

● గాయపడిన వారిని ఎస్.కోట ఆస్పత్రికి తరలింపు

శృంగవరపుకోట, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని ఎన్‌ఆర్‌పురం నుంచి వస్తుండంగా ఆటో బోల్తాపడింది. బాధితుల కథనం మేరకు.. విజయనగరం జొన్నగడ్డ గ్రామానికి చెందిన 12మంది ఆదివారం ఎన్‌ఆర్‌పురం వేంకటేశ్వరస్వామి ఆలయం, అక్కడున్న పకృతి అందాలను చూసేందుకు వెళ్లారు. తిరిగి ప్రయాణంలో ఎన్‌ఆర్‌పురం ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తాపడింది. ఈ మేరకు పి.అన్నపూర్ణ, ధనుష్, జయమ్మ, సత్యవతి, రూప,లక్ష్మి, విద్యాభాస్కర్, సాయి, బంగారమ్మలు గాయపడ్డారు. ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం కేంద్రాసుపత్రికు తరలించారు.

సెల్ రిపేర్ షాపుల్లో దొంగతనం

రాజాం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలోని తిరుమల కాంప్లెక్స్‌లోగల సెల్ రిపేర్‌షాపుల్లో ఆదివారం రాత్రి దొంగలు షట్టర్ల తాళాలు పగలగొట్టి నగదు, బంగారం దొంగతనంచేశారు. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కథనం మేరకు..శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలో గల డీఆర్‌వలసకు చెందిన పాండ్రంకి వెంకటరమణకు తిరుమల కాంప్లెక్స్‌లో రెండుసెల్ మరమ్మతుల షాపులు ఉన్నాయి. ఈనెల ఆరోతేదీ రాత్రి షాపులు మూసివేసి తిరిగి ఆదివారంఉదయం షాపులు తెరిచేందుకు వచ్చిన ఆయన రెండు షాపుల షట్టర్లు తెరిచి ఉండడాన్ని గమనించి రాజాం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఒకషాపులో అరతులం బంగారుఉంగరం, రూ.15 వేలు నగదు, మరోషాపులో అరతులం బంగారు ఉంగరం, రూ.10 వేలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదుచేశాడు.సీఐ అశోక్‌కుమార్ కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా ఇదే కాంప్లెక్స్‌లో ఓ టైలరింగ్ షాపు షట్టర్ కూడా విరగ్గొట్టారు. అయితే ఆ షాపులో విలువైన వస్తువులు లభ్యంకాకపోవడంతో వెనుదిరిగారు. క్లూస్ టీము ఘటనాస్థలాలను పరిశీలించి వేలిముద్రలు సేకరించింది.

జరజాపుపేటలో కాపర్‌వైర్..

నెల్లిమర్ల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని జరజాపుపేట జగనన్న లేఅవుట్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన రెండు 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను అగంతకులు చోరీ చేశారు. మిగతా ఐరెన్ సామగ్రి, బాక్సులు అక్కడే వదిలేశారు. ఈవిషయాన్ని స్థానికులు గుర్తించి నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావుకు తెలియజేశారు. రామారావు ఫిర్యాదుమేరకు నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.ఎస్‌ఐ బి.గణేష్, ఏఎస్‌ఐ రమణమూర్తి, సిబ్బందితో ఆదివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చీరకు నిప్పంటుకుని మహిళకు గాయాలు

రాజాం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లిఖార్జున కాలనీకి చెందిన ఎస్.విజయరత్నం నడుస్తుండగా చీరకు నిప్పంటుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. విజయరత్నం ఇంటిముందు తులసి చెట్టు వద్ద ఈనెల ఆరోతేదీన దీపంపెట్టి ఆ వైపుగా నడుస్తుండగా చీరకు నిప్పంటుకుంది. దీంతో గాయపడడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. విజయరత్నం కుమారుడు శ్రీధర్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదుచేశారు.

సనాతన ధర్మం సంస్కృతికి పునాది


మాట్లాడుతున్న శ్రావన చైతన్యాంద చిన్న స్వామి

శృంగవరపుకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):సనాతన ధర్మం భారతీయసంస్కృతికి పునాదని శ్రవన చైతన్యాంద చిన్న స్వామి తెలిపారు. ఆదివారం ఎస్.కోటలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి భగవ ద్గీత పఠనంతో సంసారం అలవాటు అవుతుందనితెలిపారు.అఖిలభారత విద్యాభారతి అధ్యక్షుడురామకృష్ణ మాట్లాడుతూ శాంతి, సమైక్యత, విశ్వకళ్యాణం సనాతన ధర్మంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్‌వీ సత్యశేఖర్, డాక్టర్ పి.వరలక్ష్మి, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ, సామాజిక వేత్త డి.సూర్యారావు పాల్గొన్నారు.

బర్మాకాలనీలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

శృంగవరపుకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బర్మాకాలనీలో శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 వలంటీర్లు ఆదివారం శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 పీవో పి.భాస్కరరావు, అధ్యాపకులు శ్రీలక్ష్మి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అంచనా బడ్జెట్‌కు అమోదం

గజపతినగరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సవరణ బడ్జెట్‌తో పాటు అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన 2025-26 సవరణబడ్జెట్, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌పై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్ 2,10,78,621కాగా అంత్యనిల్వ 2,37,24,621గా ఉన్నట్లు ప్రతిపాదించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనాబడ్జెట్ ప్రారంభనిల్వ 2,37,24,621కాగా అంత్యనిల్వ 2,35,62,521గా ఆమోదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీవో కళ్యాణి, ఏవో పుష్పలత పాల్గొన్నారు.

60 వేల సంతకాల సేకరణ

గజపతినగరం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో ఇప్పటివరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా 60వేల సంతకాలతో కూడిన దస్త్రాలను సేకరించామని, ఈనెల పదో తేదీన గజపతినగరంలో భారీ కార్యక్రమం చేపట్టి అంబేడ్కర్, వైఎస్ విగ్రహాల వద్ద దస్త్రాలను ఉంచనున్నామని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు.ఆదివారం గజపతినగరంలోవిలేకరులతో మాట్లాడుతూ 13న జిల్లా కార్యాలయానికి, 17న పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు దస్త్రాలను గవర్నర్‌కు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తవుడు, సురేష్,ఆదినారాయణ పాల్గొన్నారు.

తిమిడిలో వైద్యశిబిరం

శృంగవరపుకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమిడిలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో పలువురు విరేచనాలతో బాధపడుతుండడంతో గ్రామకార్యదర్శి బంగారునాయుడు బొద్దాంవైద్యాధికారి రమాదేవికు సమాచారం అందించారు. ఈమేరకు గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు.

నిత్యావసరాల పంపిణీ

కొత్తవలస, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని వినాయకనగర్‌లోగల ఫర్‌దిపీపుల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాలైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే కొత్తవలసకుచెందిన రాజులమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ప్రతినెలా మొదటి ఆదివారం ట్రస్టు ద్వారా దాతలు అందించే సాయంతో ఒంటరివృద్ధులకు నిత్యావసరాలను అందజేస్తున్నామని ట్రస్టు చైర్మన్ హరికుమార్ తెలిపారు.

ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి

రాజాం/రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని రాజాం ప్రభుత్వోన్నతపాఠశాలహెచ్‌ఎం బీవీ ఆచ్యుతకుమార్ కోరారు. ఆదివారం రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలతోపాటు రేగిడి, సంతకవిటి, అరసాడ, వంగర పాఠశాలల్లో ఇంగ్లీష్ పోరం ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నియోజకవర్గస్థాయిలో ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మండల స్థాయి నుంచి ఇద్దరిని చొప్పున ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.తుదిదశలో ముగ్గురిని విజేతలుగా ప్రకటించి వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అచ్యుతకుమారి, సూర్యకుమారి, వీరన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా శ్మశాన వాటికల ఆక్రమణ

● చంపావతి నదిలో ఆగని ఇసుక తవ్వకాలు ● చోద్యంచూస్తున్న అధికారులు

నెల్లిమర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):చంపావతి నది గర్భంలో ఉన్న శ్మశానవాటికలు ఆక్రమణలకు గురవుతున్నాయి. శ్మశాన వాటికల్లో మృతదేహాలను పాతేందుకు కూడా స్థలం లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టి నదిని గుల్లచేస్తున్నారు. కొండపేట వద్ద శ్మశానవాటికలో నెల్లిమర్ల నగరపంచాయతీ, రెవెన్యూఅధికారుల అండదండలతో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని విమర్శలొస్తున్నాయి. ఆదివారం కొండపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చనిపోవడంతో ఖననంచేసేందుకు స్థలం లేకపోవడంతో గ్రామస్థులు అవస్థలకు గురయ్యారు. ఇసుక అక్రమ రవాణాకు అలవాటు పడినవారు శ్మశానవాటికలను సైతం విడిచిపెట్టడం లేదని వాపోయారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో చంపావతి నది పరివాహక ప్రాంతంలో నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు శ్మశానవాటికలుగా వినియోగిస్తున్నారు.ఈతరుణంలో ఇసుకను రాత్రిపూట యంత్రాలతో తరలిస్తుండడంతో ఎవరైనా చనిపోతే నదిలో గోతుల నడుమ అంత్యక్రియలు నిర్వహించాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు.యథేచ్ఛగా నదీలో ఆక్రమిస్తున్నా అధికారులు చోద్యంచూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.


చంపావతి ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కొండపేట గ్రామస్థులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కుపంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):విజయనగరం క్యాంపుకార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం పంపిణీ చేశారు. రామవరానికి చెందిన పి.ప్రవీన్ కుటుంబానికి రూ 1,00,578, గొర్లిపేటకు చెందిన బొత్స మణికంఠ కుటుంబానికి రూ.1,58,918 చెక్కును అందించారు.కార్యక్రమంలోని టీడీపీ మండలాధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు అల్లు విజయకుమార్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో కూటమిదే విజయం: ఎంపీ


మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలదే విజయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నిరంగాల్లో రాష్ట్రం ముందుకువెళ్తోందని తెలిపారు. దేశంలోని విమానరంగంల సమస్యలపై కేంద్రప్రభుత్వం సమాచారాన్ని సేకరిస్తోందని,దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకునే అవకాశముందని తెలిపారు. విజయనగరంలో ఘన చరిత్రగల మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల అభివృద్ధికి రూ 150 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం విడుదలచేసేందుకు సిద్ధంగా ఉందని,దీనిపై త్వరలో స్పష్టత వస్తుందని చె ప్పారు.సమావేశంలో టీడీపీ నాయకులు గంటా రవి, పీతల కోదండరామ్, గాడు అప్పారావు, ముద్దాడ చంద్రశేఖర్, కోండ్రు శ్రీనివాస రావు, వారణాసి మల్లిబాబు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు: ఎమ్మెల్యే


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న లలితకుమారి

లక్కవరపుకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం లక్కవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటి వద్ద ఇరవై మంది సభ్యులకు సీఎంఆర్ఎఫ్ కింద సుమారు రూ.19 లక్షల ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నిరకాల సహాయ చర్యలు ద్వారా సుమారు మూడు కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం పేదవాడిని పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. దొంగతనాన్ని కూడా చిన్నదీ పెద్దదీ అంటూ వర్ణించడం ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజలంతా సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరును పరిశీలించాలన్నారు.స్థానికసంస్థల ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్ రాకూడదన్నారు.కార్యక్రమంలో కేబీఏ రాంప్రసాద్, టీడీపీమండలాధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, రత్నాజీ, చంద్రశేఖర్, జీఎస్.నాయుడు, కోళ్ల శ్రీను, రెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

హిందీ మంచ్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హిందీ భాషాభిమానుల వేదిక, హిందీ మంచ్ జిల్లా అధ్యక్షుడిగా గుజ్జింగివలస జడ్పీ హైస్కూల్ హిందీ పండిట్ ఏలూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయనగరంలో జరిగిన ఎన్నికల్లో ప్రధానకార్యదర్శిగా నందివాడ చిన్నాదేవి, గౌరవాధ్యక్షురాలిగా పి.ఉమాబాల, సహాయ అధ్యక్షురాలిగా బి.సూర్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచ్ ఉత్తరాంధ్ర కార్యదర్శి పి.శ్రీధర్ ఎన్నికల సమన్వయకర్తగా వ్యవహరించారు. సంఘటన కార్యదర్శులుగా శారదా, పద్మావతి, ఉపాధ్యక్షులుగా చంద్రరావు, విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా సంతోషి, సూర్యకుమారి, శ్రీదేవి,ముఖ్య సలహాదారులుగా కుసుమంచి సుబ్బారావు, గౌరవ సలహాదారుగా దవళ సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు.

చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా అచ్యుతకుమార్

రాజాం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎంగా (ఎఫ్ఏసీ) ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బీవీ అచ్యుతకుమార్‌ను నియమిస్తూ ఈనెల ఆరో తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటివరకూ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పాలిశెట్టి వెంకటరావు ఉద్యోగవిరమణ చేయడంతో అచ్యుత్‌కుమార్‌ను విద్యాశాఖ హెచ్‌ఎంగా నియమించింది. ఇదే పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకూ చదువుకున్నారు. ఇక్కడే ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అచ్యుత్‌కుమార్ పూర్తి అదనపుస్థాయి హెచ్‌ఎంగా నియమితులు కావడంతో రెడ్‌క్రాస్ సొసైటీ రాజాంశాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ (1979-89) అధ్యక్షులు డాక్టర్ పీఎల్ఎన్ రాజు, సభ్యులు చంద్రశేఖర్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు రాజాంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అచ్యుత్‌కుమార్‌ను అభినందించారు.

దుర్గమ్మ దర్శనానికి సైకిల్‌పై పయనం

నెల్లిమర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలంలోని అలుగోలు, ఒమ్మి గ్రామాలకు చెందిన ఇద్దరు భవానీ మాలధారకులు కోరాడ గోవర్దన్, అంబల్ల అప్పలనాయుడు ఆదివారం ఆయా గ్రామాల నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ దర్శనానికి సైకిల్‌పై బయలుదేరారు. వీరిద్దరూ సైకిల్‌యాత్ర ద్వారా దుర్గమ్మ దర్శనానికి గతంలో రెండు సార్లు వెళ్లిన విషయం విదితమే. గ్రామానికి చెందిన గురుస్వామి కురిమినేని నారాయణరావు ఆధ్వర్యంలో యాత్రకు బయలుదేరి వెళ్లారు.

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి: గవర్నర్


విద్యార్థికి డిగ్రీ ప్రదానం చేస్తున్న గవర్నర్ హరిబాబు

పర్లాకిమిడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వర్సిటీలో అధికంగా పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం పర్లాకిమిడిలోని సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు ఉద్యోగానికే పరిమితం కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా తయారవ్వాలన్నారు. రక్షణ రంగంలో భారత్ రోజురోజుకు బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీల పట్టాలను గవర్నర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డైరెక్టర్ జనరల్ వీకే దాస్, వర్సిటీ చైర్మన్ ముక్తాకాంత్ మిశ్ర, వైస్ చెర్మన్ డీఎన్ రావు, వైస్‌చాన్సలర్ బిశ్వజిత్ మిశ్రా పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 4009 మంది హాజరు

విజయనగరం, కలెక్టరేట్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 19 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎన్ఎంఎంఎస్ పరీక్ష జరిగింది.ఈపరీక్షకు జిల్లాలోని 4094 మందికిగాను4,009 మంది హాజరయ్యారు. విజయనగరం పట్టణంలో జరిగిన పరీక్ష కేంద్రాలను డీఈవో మాణిక్యం నాయుడు, డీఈసీ బోర్డు సెక్రటరీ టి.సన్యాసిరాజు తదితరులు పరిశీలించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అప్పలాచారి

నెల్లిమర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని సెలివాడ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు దంతినాడ అప్పలాచారి ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పలాచారి రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తున్నారు.

మరమ్మతులులేక.. అభివృద్ధికి నోచుకోక

● మట్టి రోడ్డును తలపిస్తున్న బీటీరోడ్డు ● వాహనచోదకులకు అగచాట్లు ● ఇదీ మందరాడ-గోవిందపురం రహదారి పరిస్థితి

సంతకవిటి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందరాడ నుంచి గోవిందపురం పీఆర్ రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. ప్రభుత్వాలు మారుతున్నా తమ రోడ్డును అభివృద్ధిచేయడంలేదని ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా గుతులమయమై చిన్నపాటి వర్షానికి బురదమయమవుతోంది.

మందరాడ నుంచి గోవిందపురం రహదారిలో రెండు అడుగుల లోతులో భారీ గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు, పాదచారులు అగచాట్లకు గురవుతున్నారు. రాజాం, సంతకవిటిలోని ఆసుపత్రులకు వెళ్లే సమయంలో గర్భిణులు గోతులు ఉన్నచోట ఇబ్బందిపడుతున్నారు. చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణమంటే హడలిపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా ఈరహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.రెండు దశాబ్దాల కిందట వేసిన బీటీరోడ్డు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాళ్లు తేలి మట్టిరాడ్డులా మారింది. ఈ మార్గంలో గోవిందపురం, నారాయణరాజపురం, మోదుగులపేట, ముఖుందపురం తదితర ఎనిమిది గ్రామాలకు చెందిన 200 వందలు వాహనచోదకులు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు.సంతకవిటి జూనియర్ కళాశాలకు, మందరాడ జడ్పీ ఉన్నతపాఠశాలకు వందమంది చొప్పున ప్రతిరోజూ వెళ్తుంటారు. రాజాంలోని డిగ్రీ కళాశాలలకు మందరాడ మీదుగా వందలాది మంది వెళ్తున్నారు.అయితే వైసీపీ హయాంలో రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా బీటీ రోడ్డుపై ఉన్న లేయర్ పొర తీసి విడిచిపెట్టారు. దీంతో రాళ్లుతేలి అధ్వానంగా మారడంతో కష్టాలు మరింతపెరిగాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు రాళ్లపైపడి గాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దృష్టికి స్థానికులు గోవిందపురం-మందరాడ రహదారిదుస్థితిని తీసుకువెళ్లిన విషయం విదితమే. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.


గోతులమయమైన గోవిందపురం-మందరాడ రోడ్డు

ఇంకా పరాయి పంచనే!

(5వ పేజీ తరువాయి)

కూడా సొంత భవనం లేదు. పార్వతీపురం ఐటీడీఏ కోసం నిర్మించిన భవనంలోనే కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితర కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఐటీడీఏకు భవనం నిర్మించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భవనాన్ని కలెక్టర్ కార్యాలయంగా మార్చారు. ● కొన్ని ప్రభుత్వ శాఖలను ఇరుకైన గదుల్లో నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఐసీ డీఎస్‌తో పాటు జిల్లా సబ్ రిజిస్ట్రార్ తదితర కార్యాలయాలు విశాలమైన ప్రైవేట్ భవనాల్లోకి మార్చారు. ఇదిలా ఉండగా జిల్లాలో పలు శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. కొన్నాళ్లుగా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదు రవుతున్నాయి. ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు
వంద రోజుల ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

లోపు లీప్ యాప్‌లో నమోదు చేయాలి. విద్యార్థులను లెవెల్ వన్, లెవెల్-2గా విభజించాలి. ప్రశ్నాపత్రాలను జిల్లా కార్యాలయం నుంచి రోజూ వాట్సాప్ ద్వారా పంపిణీ చేయాలి. ఎంఈవోలు, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సి ఉంది. 'పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఈ మేరకు వంద రోజుల ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తున్నాం. మరోసారి ఉత్తమ ఫలితాలు సాధించి.. జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుం టున్నాం.' అని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు

(5వ పేజీ తరువాయి)

ఉండాలన్నారు. గోనె సంచులు, కలాసీ, రవాణా ఖర్చులు నేరుగా రైతు ఖాతాలో జమ అవుతాయన్నారు. నిబంధనల అమలు లో ఎటువంటి అవకతవకలు జరిగినా మండల వ్యవసాయాధికారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ● అనంతరం ఆయన వంతరాం గ్రామంలోని కేజీబీవీని సందర్శించారు. వసతి గృహం, కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. బాలికలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆహారం నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచిం చారు. విద్యార్థినుల హాజరు, స్టాక్ రిజిస్టర్లు, మెనూ అమలును పక్కాగా నిర్వహించాలన్నారు.

అమ్మో చలి


చలిమంట వద్ద గిరిజనులు

భామిని, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం 5 గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. తివ్వకొండ ప్రాంతాల్లోని ఆదివాసీ గ్రామాలో గిరిజనులు అగ్గిమంటలు వేసి చలి కాగుతున్నారు. ఎన్నడూ లేని విధంగా చలి తీవ్రత ఉందని గిరిజనులు చెబుతున్నారు. మంచుకూడా వర్షంలా పడుతుందని వారంటున్నారు. ఉదయం 7 గంటల వరకు మంచు కురవడంతో పనులేమీ చేయలేకపోతున్నామని గిరిజనులు తెలిపారు.

ఆకర్షణలో పడొద్దు


విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవో

సీతంపేట రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రేమ అనే ఆకర్షణకు లోనై భవిష్యత్‌ను చీకటిమయం చేసుకోవద్దని సీఎంవో చిరంజీవులు సూచించారు. స్థానిక గిరిజనసంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం బాల్య వివాహాలు, ఆకర్షణ వంటి అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ప్రేమ అనే రెండు అక్షరాలకు ఆకర్షితులైతే జీవితంలో ఎదురయ్యే పరిస్థితులపై వివరించారు. ప్రేమంటే తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు మీపై చూపేదే నిజమైనదన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంత, హెచ్‌డబ్ల్యువో పి.అమలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయం చోరీ నిందితుల అరెస్టు

బొబ్బిలి/రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పిరిడిలో నవంబరు 5న శాంకరిమాత ధ్యాన మందిరంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం అరెస్టు చేశామని సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. బొబ్బిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చోరీ కేసులో సీతానగరం మండలానికి చెందిన పోల భాస్కరరావు, శ్రీకాకుళం జిల్లా హిరమండలానికి చెందిన సవర సూర్యను ఎస్‌ఐ రమేశ్ అరెస్ట్ చేశారన్నారు. వారి నుంచి పుస్తెల తాడు, శతమానాలను రికవరీ చేసి కోర్టులో ప్రవేశపెట్టమన్నారు. వారికి బొబ్బిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు. వీరిద్దరూ గతంలో ఇలాంటి దొంగతనాలు చేసినట్టు అంగీకరించారని సీఐ తెలిపారు. జిల్లాలో పలు దొంగతనాలు చేస్తున్న వీరిని అరెస్ట్ చేసిన సీఐ సతీష్, ఎస్‌ఐ రమేశ్‌లను డీఎస్పీ భవ్యారెడ్డి అభినందించారు.

వాలీబాల్ విజేత చిలకలపల్లి జట్టు

బొబ్బిలి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలో మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లి జట్టు విజేతగా నిలిచింది. అంబేద్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో బొబ్బిలి మండలంలోని రంగ రాయపురం జట్టు ద్వితీయ స్థానం, బలిజిపేట జట్టు తృతీయ స్థానం, రాజాకళాశాల జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ. 5 వేలు, రూ.2,500, రూ. 1500 చొప్పున జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అందజేశారు. ఈ సందర్భంగా ఆ యన క్రీడాకారులను అభినందించారు. సాంబయ్య మాట్లాడుతూ అంబేద్కర్ స్మారకార్థం ఈ పోటీలను నిర్వహించామన్నారు. వెటరన్ వాలీబాల్ క్రీడాకారుడు గురాన రామకృష్ణ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరె క్టర్లు గిరడ ప్రభాకరరావు, ఇనుగంటి విజయ్‌కుమార్, సత్యనారాయణ రిఫరీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేత బొద్దాన అప్పారావు, సీనియర్ న్యాయవాది ఎస్.జె.విల్సన్ బాబా, కనకమహేశ్ పట్నాయక్, ఎండ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ ఫెస్ట్‌లో పాల్గొనండి

బొబ్బిలి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఖరగ్‌పూర్ ఐఐటీలో జనవరి 16 నుంచి నిర్వహించే టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ క్షితిజ్-2026లో విద్యార్థులు పాల్గొనాలని క్షితిజ్ ఫెస్ట్ విద్యార్థుల ప్రతినిధి శశాంక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు ఆదివారం బొబ్బిలిలో విలేకరుల వెల్లడించారు. జనవరి 16 నుంచి నిర్వహించే ఫెస్ట్‌లో 40కి పైగా ఈవెంట్లు, పోటీలు, వర్క్‌షాప్‌లు, గెస్ట్ లెక్చర్లు, ఇంటరాక్టివ్ సెషన్లు, ఎగ్జిబిషన్లు ఉంటాయన్నారు. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఇది అద్భుతమైన వేదిక అన్నారు.

విశ్రాంతి భవనాన్ని వినియోగంలోకి తీసుకురండి

- ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం
- సీఎం రాకతో ప్రాంగణం శుభ్రం



గతంలో ప్రయాణికుల విశ్రాంతి భవనం.. సీఎం చంద్రబాబు పర్యటనతో మారిన పరిస్థితి

భామిని, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని వినియోగానికి దూరంగా ఉంది. ఇప్పటి వరకూ చెత్తా చెదారంతో నిండిన ఆర్టీసీకి చెందిన ప్రయాణికుల విశ్రాంతి భవనంపై ఆ శాఖాధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరారు. భామినిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఆ ప్రాంతాన్ని శుభ్రంచేశారు. మండల కేంద్రం లోని విశ్రాంతి భవనం వినియోగంలో లేకపోవడంతో రోడ్డుపైనే బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. వినియోగానికి దూరంగా ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేపట్టి.. ఇక్కడ బస్సులు నిలిపే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరారు. రోడ్డుకు చేరువలోనే విశ్రాంతి భవనం ఉన్నప్పటికీ దాన్ని ఆర్టీసీ వినియోగించిన తీరు పలు విమర్శలకు తావిస్తోంది.


ఆరుబయట బస్సు ఎక్కుతూ..

డిపోల మధ్య సమన్వయలోపం

ఈ ప్రాంతంలో శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక్క బస్సు రాకపోకలు సాగిస్తోంది. పాలకొండ డిపో నుంచి ఒక్క బస్సు నడుస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా పేరుకే తప్ప ఈ రూట్‌లో ఒక్క సర్వీసు తిప్పడం లేదు. ఈ రూట్‌లో ఆదాయం శ్రీకాకుళం రెండో డిపోకు చేరుతుండటంతో పాలకొండ పరిధిలో భామినిలోని ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని పట్టించుకోవడంలేదు. భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేయడం లేదనేది స్థానికుల మాట. దీంతో విద్యార్థులు మహిళలు, వృద్ధులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా వి శ్రాంతి భవనాన్ని ఉపయోగంలోకి తెస్తే ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందిజ ఈ విషయం పాలకొండ డిపో మేనేజర్ వి.ఎస్.ఎన్.మూర్తి వద్ద ప్రస్తావించగా మరమ్మతుల కోసం ప్రతిపాదించి ఉన్నాం. మంజూరు అయితే వెంటనే పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

పాత బట్లభద్రలో ఏనుగులు


చెరువులో సేదతీరుతున్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పాత బట్లభద్రలో ఏనుగులు తిష్ట వేశాయి. ఐదు రోజులుగా వివిధ ప్రాంతాల్లో సంచరించిన ఏనుగుల గుంపు ఆదివారం ఉదయం పాత బట్లభద్ర పక్కనే చెరువులో సేదతీరాయి. ప్రస్తుతం ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఏనుగుల సంచారం రైతులను కలవరపరుస్తున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. దీంతో వీటిని తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు నోటిఫికేషన్

గరుగుబిల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల అధికారి నీలంసాహ్ని నోటిఫికేషన్ విడుదల చేశారు. సంబంధిత నోటీస్‌ను ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో అతికించే ఏర్పాటు ఎంపీడీవో జి.పైడితల్లి చేయించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మదర్ సాహెబ్ ఈ ఏడాది జూలై 15న మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆ ఖాళీ భర్తీకి ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నికకు సంబంధించి ఆసక్తి గలవారు ఈ నెల 11న మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేయవచ్చుని ఎంపీడీవో తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 1 గంటకు కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక నిర్వహిస్తామన్నారు. దీనికి ఎన్నికల అధికారిగా పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావును ఉన్నతాధికారులు నియమించారని తెలిపారు.

లభ్యమైన మృతుడి వివరాలు

సీతానగరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మరిపివలస సమీపంలో ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమైనట్టు ఎస్‌ఐ ఎం.రాజేశ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మక్కువ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన పి.కుమార్ తన ఇంట్లో నిర్వహించనున్న ఫంక్షన్‌కు సంబంధించిన కబుర్లు చెప్పడానికి వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న సేవాశిబిరం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థినిలు

పాలకొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ, వడమ ప్రాంతాల్లో ప్రత్యేక సేవా శిబిరాన్ని ఆదివారం కొనసాగించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో కార్య క్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా యోగా గురువుతో వివిధ రకాల యోగాసాలను వలంటీర్లతో వేయించారు. యోగా ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రాజ్యలక్ష్మి సూపర్ జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా గురువు కె.జనార్దనరావు, ఖండ్యాం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం దొర, ఉపాధ్యాయులు విజయకిరణ్, వై.నిర్మల, వార్డు ప్రతినిధులు టి.లక్ష్మణరావు, పి.బాబ్జీరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.జయమణి, రాజు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా
రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటనాయుడు

వీరఘట్టం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టానికి చెందిన గుణుపూరు వెంకటనాయుడు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆదివారం నియమితులయ్యారు. 2000 నుంచి బీజేపీ ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వివిధ పదవుల్లో కొనసాగారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వెంకటనాయుడును అభినందించారు

ఎమ్మెల్యే దృష్టికి రహదారుల సమస్య

గరుగుబిల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరిని కోరినట్టు ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. ఆదివారం మరుపెంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారుల సమస్యతో పాటు మండలానికి సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మరుపెంట సమీపంలోని తోటపల్లి పాత రెగ్యులేటర్ కుడి కాలువపై గతంలో నిర్మాణం చేపట్టిన స్లాబ్ కల్వర్టు మరమ్మతులకు గురవ్వడంతో రైతులు పంట పొలాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పానన్నారు. కుడి కాలువపై ఉన్న కల్వర్టు ప్రస్తుతం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని వివరించానన్నారు. గొల్లవానివలస గ్రామ సమీపంలో కల్వర్టు లేని కారణంగా గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపానని ఎంపీపీ వివరించారు.

పవర్ ప్లాంట్ జీవో రద్దు చేయండి


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మక్కువ రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరు ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇచ్చిన జీవో నెంబరు 84ను రద్దు చెయ్యాలని పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ రాయల సుందరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎర్ర సామంతవలసలో హైడ్రో పవర్ ప్లాంట్ వ్యతిరేక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుగ్గేరు ప్రాంతంలోని గిరిజన రైతులకు తీవ్ర నష్టం కలిగించే 2000 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను రద్దు చెయ్యాలని కమిటీ తీర్మానం చేసింది. అనంతరం సుందరరావు మాట్లాడుతూ దుగ్గేరు ప్రాంతంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు వల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్లాంట్ ఏర్పాటైతే గిరిజన గ్రామాలు ఖాళీ చెయ్యాల్సి వస్తోందన్నారు. పచ్చని అడవులు కూడ నాశనమవుతాయన్నారు. అనంతరం రైతు కూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ 100శాతం గిరిజనులు నివసిస్తున్న గ్రామాలను సైతం షెడ్యూల్ గ్రామాలగా ప్రకటించకుండా గత ప్రభుత్వాలు గిరిజనులకు అన్యాయం చేశాయన్నారు. అందరు కలసికట్టుగా పవర్ ప్లాంట్ ఏర్పాటును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పవర్ ప్లాంట్ ఏర్పాటు వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, ప్రసాద్, చెంచు తదితరులున్నారు.

గిరిజన సమస్యలపై కవితా సంకలనం


మాట్లాడుతున్న రచయిత జగదీశ్

కురుపాం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సమస్యలపై నిర్భయంగా ఎలుగెత్తి చాటిన కవితా సంకలనమే దుర్గ అని రచయిత రౌతు బంగారు నాయుడు అన్నారు. ఆదివారం కురుపాం స్నేహ కళాసాహితీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సమావేశంలో బంగారునాయుడు, మల్లిపురం జగదీశ్ రాసిన కవితా సంకలనాన్ని పరిచయం చేశారు. పుస్తకంలో గిరిజన సంప్రదాయాలు, సమస్యలు, ఈ ప్రాంత దోపిడీ, రిజర్వేషనుల కోసం రచయిత వివరించారన్నారు. సమావేశంలో తెలుగు అధ్యాపకులు నడికట్ల మురళీకృష్ణ, ఆకుల జగదీశ్వరరావు, గోవింద కృష్ణారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉపాధి' క్షేత్ర సహాయకుడికి గాయాలు

కురుపాం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కురుపాంలోని గొరడ ప్రధాన రహదారిలో బుడ్డెమ్మఖర్జ సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మండలంలోని కిచ్చాడ పంచాయితీ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు గోళ్ల గౌరీశంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. గౌరీశంకర్‌ది కిచ్చాడ పంచాయతీలోని పట్టియిదొరవలస గ్రామం.

హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా శేఖర్

పాలకొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం నిర్వహించిన హెల్పింగ్ హ్యాండ్స్ వార్షికోత్సవంలో భాగంగా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి మండలంలోని మల్లివీడు గ్రామానికి చెందిన యవర్ణ శేఖర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈయన పెద్ద పొల్ల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మెడికల్ క్యాంప్‌లు, బ్లడ్ క్యాంప్‌లు, నిరా శ్రయులకు ఆర్థికసేవలు చేస్తూ సామాజికవేత్తగా ప్రజల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పలువురు ఆయన్ని అభినందించారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం


మాట్లాడుతున్న భరత్‌కుమార్

బెలగాం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు హిందువులు భాగస్వాములు కావాలని మూడు రాష్ట్రాల ఆర్ఎస్ఎస్ ప్రచారక్ భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్వతీపురంలోని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జీజే కళాశాల మైదానంలో హైందవ శంఖారావం సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను, హిందూ సమాజాన్ని పరిరక్షించేందుకు 1925లో ఆర్ఎస్ఎస్ స్థాపించారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్ల అయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా హైందవ శంఖారావం నిర్వహించి హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ డా.డి.రామ్మోహన్‌రావు, బీఎన్‌బీ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీలో పర్యాటకుల సందడి

సీతంపేట రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని పర్యాటక ప్రదేశాలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. జలపాతం వద్ద స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. అలాగే పార్క్‌లో 5డి థియేటర్, బోటింగ్, కాయకింగ్, షూటింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జ్, స్కై సైక్లింగ్, కమాండో నెట్ వంటి సాహసోపేతమైన క్రీడల్లో పాల్గొన్నారు.

పార్క్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి


ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు మేనిఫెస్టోలో హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుండటంలో ఓర్వలేక డిప్యూటీ ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విమర్శించారు. ఆదివారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ లబ్ధిపొందాలని చూడటం హేయమైన చర్య అన్నారు. విజయవాడలో నిర్వహించే జాతీయ గిరిజన సాంస్కృతిక కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరైతే.. భామినిలో సభకు సీఎం చంద్రబాబు ఆహ్వానించలేదని తప్పుడు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో మారుమూల కొండ శిఖర గ్రామాలకు రహదారులు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్య, వైద్య సేవలు మెరుగుపరుస్తున్నామని వివరించారు. తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని జగదీశ్వరి అన్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే జయకృష్ణ


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పాలకొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మానవత్వం చాటుకున్నారు. తలవరం, సెయింట్ డొమినిక్ మధ్యలో ఆదివారం రెండు లగేజీ ఆటోలు ఢీకొన్న ఘటనలో పలువురు గాయాలపాలయ్యారు. అటుగా వెళుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వెంటనే కారును ఆపి తన కారులో గాయపడిన వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి ఆసుపత్రికి తరలించారు.

కళాభారతి వేదికను ఏర్పాటు చేయండి

పాలకొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా గత మాదిరి కోటదుర్గమ్మ గుడి ఆలయం వద్ద కళాభారతి వేదికను ఏర్పాటు చేయాలని పాలకొండకు చెందిన భాసూరు శివశంకర్‌ప్రసాద్ ఆదివారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సరైన వేదిక లేకపోవడంతో కళాకారులు, సాహితీప్రియులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిం చారు. కళాభారతి వేదిక ఏర్పాటుకు సంబంధించి తప్పనిసరిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతుసేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

సీతానగరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గాదెలవలస, జానుమునివలస రైతు సేవాకేంద్రాన్ని ఆదివారం జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణేశ్వరి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, గోనె సంచులు, తూనిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విప్పలవలస ఆనంద అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆమె సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. కొంతమంది రైతులు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని ఆమెకు ఫిర్యాదు చేశారు.

నామమాత్రంగా మండల సమావేశం

సీతానగరం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ బలగ రమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయ సహాయకుడు లక్ష్మణరావు మాట్లాడుతూ ధాన్యం డబ్బులు 24 గంటల్లో రైతుల అకౌంట్లలో జమ అవుతున్నాయన్నారు. శరవేగంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికి సుమారు 7 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుకు ట్రక్ షీట్లు ఇచ్చామన్నారు. ఎంఈవో వెంకటరమణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలిగితే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు పలు అంశాలపై మాట్లాడి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ కోసం భయపడాల్సిన అవసరం లేదని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎంకే తిరుమల ప్రసాద్ అన్నారు. దాన్ని సకాలంలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఆదివారం పీహెచ్‌సీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్క్రబ్ టైఫస్ అంటే ఇది ఒక బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి అన్నారు. మైట్ అనే చిన్న కీటకం (నల్లి లాంటిది) కుట్టడం వల్ల ఈ బ్యాక్టీరియా మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ కీటకాలు ఎక్కువగా పొదలు, పచ్చిక బయళ్లలో ఉంటాయన్నారు. కుట్టినప్పుడు ఆ ప్రదేశంలో నల్లని మచ్చ ఏర్పడుతుందన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందకుండా మందులు వాడాలన్నారు. ఈ మందులు పీహెచ్‌సీల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదమని హెచ్చరించారు.

కొనుగోలులో నిబంధనలు పాటించాలి

పాలకొండ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం సేకరణ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే వివిధ మం డలాల్లో రైతుల కల్లాలకు వెళ్లి స్వయంగా పరిశీలించానన్నారు. రైతుల సమస్యలు, రైస్ మిల్లర్ల నిర్ణయాన్ని అధికారుల దృష్టి తీసుకెళ్లడానికి ఏపీ రైతు సంఘం ముందు ఉంటుందన్నారు.